సాక్షి
రంగారెడ్డి
గురువారం । 14 । మార్చి । 2024



రంజాన్ వేళ..

జల్‌పల్లి మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించకపోవడంతో ముస్లింలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. 8లో▸



బీజేపీ జెండా ఎగరాలి

చేవెళ్ల పార్లమెంటు స్థానంలో బీజేపీని గెలిపించేందుకు సమష్టిగా కృషి చేయాలని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
గురువారం (సాయంత్రం)	శుక్రవారం (ఉదయం)
6:31	5:02

న్యూస్‌రీల్

నేటి నుంచి లోక్ అదాలత్

షాద్‌నగర్: కోర్టు పరిధిలోని పెండింగ్ కేసులున్న కక్షిదారులు లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ సీఎం.రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. కేసుల విషయంలో రాజీ మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. మహాశివరాత్రి సెలవుల సందర్భంగా వాయిదాపడిన లోక్ అదాలత్ కార్యక్రమం ఈ నెల 14, 15, 16న నిర్వహిస్తామన్నారు. లోక్ అదాలత్ ప్రత్యేక అధికారిగా జిల్లా విశ్రాంత న్యాయమూర్తి రవీంద్రసింగ్, సభ్యులుగా న్యాయవాది సీహెచ్.శ్రీనివాసమూర్తి వ్యవహరిస్తారని తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు

మొయినాబాద్: తహసీల్దార్ విధులకు ఆటంకం కలిగించి బెదిరించినవారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. సురభి వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసినవారు చిలుకూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 277లోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారని ఇటీవల గ్రామస్తులు తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం తహసీల్దార్ గౌతమ్‌కుమార్ రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్‌తో కలిసి ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ క్రమంలో ప్రభుత్వ భూమి కబ్జా చేయడంతోపాటు 111 జీఓ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న మేకల కల్యాణ్ చక్రవర్తి, భార్య, కొంత మంది అనుచరులు తహసీల్దార్ గౌతమ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది విధులకు ఆటకం కలిగిస్తూ బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ విషయమై తహసీల్దార్ గౌతమ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కళ్యాణ్ చక్రవర్తి, అతని భార్య, అనుచరులపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఆరె కటికల కార్పొరేషన్ ఏర్పాటుకు డిమాండ్

కేశంపేట: ఆరె కటికలకు ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివాజీ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..కుల సంఘాలకు కార్పొరేషన్ల ఏర్పాటు చేస్తున్నట్లు మంగళవారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారని అందులో ఆరె కటికలను విస్మరించారన్నారు. బీఆర్‌ఎస్ ఎన్నికల సమయంలో ఆరె కటికలను ఎస్సీ జాబితాలో చేర్చుతామని మాటిచ్చి తప్పిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సంఘానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోతే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

రేపు మోదీ షో

సాక్షి, సిటీబ్యూరో: భాగ్యనగరం వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. ఒకట్రెండు రోజుల్లో ఎన్నికల నగారా మోగనుందనే సంకేతాల నేపథ్యంలో ప్రధాని మోదీ.. ఈ నెల 15న మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో ప్రచారపర్వానికి శ్రీకారం చుట్టనున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధించాలని భావిస్తున్న భారతీయ జనతాపార్టీ..మల్కాజ్‌గిరి స్థానంపై ప్రత్యేక దృష్టి సారించింది. సిట్టింగ్ సికింద్రాబాద్ స్థానం సహా మల్కాజ్‌గిరి, చేవెళ్ల, హైదరాబాద్ స్థానాలపై ఫోకస్ పెట్టిన కమలదళం ..ప్రచారపర్వంలోకి జాతీయ నేతలను రంగంలోకి దించుతోంది. ఇటీవల నగర శివార్లలోని పటాన్‌చెరులో జరిగిన బహిరంగ సభలో మోదీ పాల్గొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే లోక్‌సభ ఎన్నికలకు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ నగర ఓటర్లను ఆకట్టుకునేందుకు రోడ్‌షోలు నిర్వహిస్తోంది. మల్కాజ్‌గిరిలో ఐదు కిలోమీటర్ల మేర ప్రధాని రోడ్ షో నిర్వహించేలా కార్యక్రమాన్ని రూపొందించింది.

పీఎం పర్యటన నేపథ్యంలో ఆంక్షలు

మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో పోలీసులు పలు ఆంక్షలు విధించారు. ఈ నెల 15న మల్కాజ్‌గిరిలో జరగనున్న సభలో మోదీ పాల్గొననున్నారు. దీంతో మీర్జాల్‌గూడ నుంచి మల్కాజ్‌గిరి క్రాస్ రోడ్ వరకు 5 కి.మీ. మేర పారా గ్లైడర్లు, రిమోట్ కంట్రోల్ డ్రోన్‌లు, రిమోట్ కంట్రోల్ మైక్రో లైట్ ఎయిర్‌క్రాఫ్టలను ఎగరవేయడానికి అనుమతి లేదని రాచకొండ పోలీసు కమిషనర్ తరుణ్ జోషి ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

‘ధరణి’ భారం



లాగిన్ ఇవ్వకపోవడంతో ఫైల్స్ పెండింగ్

- రిపోర్టులతోనే సరిపెడుతున్న తహసీల్దార్లు, ఆర్డీఓలు
- రైతులకు సమాధానం చెప్పలేకపోతున్న అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ధరణి దరఖాస్తుల పరిష్కారంలో ప్రభుత్వం చెప్పుతున్న దానికి క్షేత్రస్థాయిలో అమలుతీరుకు పొంతన ఉండడం లేదు. ఏళ్ల నుంచి అపరిష్కృతంగా మిగిలిపోయిన ధరణి దరఖాస్తుల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెల ఒకటి నుంచి తొమ్మిది వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు రెండు బృందాలుగా ఏర్పడి గ్రామాల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని భావించారు. కానీ ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న కంపెనీ సహా సీసీఎల్ఏ నుంచి సరైన సహకారం లేకపోవడంతో తహసీల్దార్లు సైతం చేతులెత్తేయాల్సి వస్తోంది.

పెండింగ్‌లోనే దరఖాస్తులు

జిల్లా వ్యాప్తంగా ధరణి పోర్టల్‌లో 39,076 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, వీటిలో 3,622 ఫైళ్లకు సంబంధించి నివేదికలు సిద్ధం చేశారు. ఇక వికారాబాద్ జిల్లాలో 14,501 దరఖాస్తులు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 9,419 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. వివాదాస్పద స్థలాలకు సంబంధించిన దరఖాస్తులే ఎక్కువగా ఉన్నాయి. ఇందులో ప్రధానంగా విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, మిస్సింగ్ సర్వే నంబర్లు, నిషేధిత జాబితాకు సంబంధించినవే అధికంగా ఉన్నాయి. వీటి పరిష్కారానికి తహసీల్దార్లకు, ఆర్డీఓలకు, కలెక్టర్లకు లాగిన్ ఇవ్వక పోవడంతో ఇప్పటి వరకు ఆయా ఫైళ్ల క్లియరెన్స్‌కు నోచుకోలేదు.

క్షేత్రస్థాయి పర్యటనకు నిరాకరణ

రైతులు, భూ బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన అధికారులు వాటి పరిష్కారానికి క్షేత్రస్థాయి పర్యటనలు చేసి, సరిహద్దు రైతుల నుంచి వివరాలను సేకరించి సమస్యకు పరిష్కార మార్గం చూపనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే వారికి ఇప్పటి వరకు లాగిన్ ఇవ్వకపోవడంతో సమస్యలు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ఇప్పటికే ఆగ్రహంతో ఉన్న రైతులు.. సమస్య పరిష్కరించకుండా క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్తే భౌతిక దాడులకు దిగుతారని ఆందోళన చెందుతున్నారు. ధరణి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ తరచూ జిల్లాలో పర్యటిస్తుండడం, రోజుకో రకమైన ప్రకటనలు చేస్తుండడం అధికారుల్లో గందరగోళానికి కారణమవుతోంది. తహసీల్దార్లకు లాగిన్ ఇస్తే.. నివేదికలు అందినవాటికి పరిష్కారం చూపే అవకాశం ఉంది. కానీ ఇప్పటికీ క్లారిటీ లేక బాధితులు ఆందోళన చెందుతున్నారు.

మండలాల వారీగా దరఖాస్తుల వివరాలు

మండలం	పెండింగ్ దరఖాస్తులు	సిద్ధమైన నివేదికలు
శంకర్‌పల్లి	3,000	300
మొయినాబాద్	2,246	571
షాబాద్	1,580	580
కందుకూరు	2,531	400
యాచారం	2,550	700
అబ్దుల్లాపూర్‌మెట్	2,111	274
మంచాల	2,291	-



డిప్యూటీ తహసీల్దార్ కీర్తిసాగర్‌కు దరఖాస్తులు అందజేస్తున్న ధరణి కమిటీ సభ్యులు ముదిరెడ్డి కోదండరెడ్డి, సునీల్‌కుమార్

రెవెన్యూ అధికారులకు లాగిన్లు ఇస్తాం

యాచారం: రైతులు ఆందోళన చెందొద్దు.. విడతల వారీగా రెవెన్యూ అధికారులకు లాగిన్లు ఇచ్చి భూ సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామని ధరణి కమిటీ సభ్యులు ముదిరెడ్డి కోదండరెడ్డి, సునీల్‌కుమార్ పేర్కొన్నారు. లీఫ్స్ సంస్థ యాచారం మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని సంస్థ అధ్యక్షుడు సునీల్ కుమార్ ఆధ్వర్యంలో 24గ్రామాల భూ న్యాయ శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల నుంచి సేకరించిన 2,075 దరఖాస్తులను బుధవారం డిప్యూటీ తహసీల్దార్ కీర్తిసాగర్‌కు అందజేశారు. ప్రభుత్వం విడతల వారీగా తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్‌కు లాగిన్లు ఇచ్చి సమస్యలకు పరిష్కారం చూపనుందన్నారు. రైతుల భూ సమస్యలు పరిష్కరించే విషయంలో రేవంత్‌రెడ్డి సర్కార్ చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.



అధికారుల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

నిష్పాక్షికంగా ఎన్నికల విధులు

- ప్రచార సరళి, ఎన్నికల వ్యయంపై నిశిత పరిశీలన తప్పనిసరి
- నిఘా బృందాలకు, అధికారులకు అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ దిశానిర్దేశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల విధులను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులకు సూచించారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని స్టాటిస్టిక్ సర్వేలైన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ తదితర నిఘా బృందాల అధికారులకు బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయా పార్టీలు, అభ్యర్థుల ప్రచార సరళి పరిశీలన, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను నిరోధించడం, ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం, నిరంతర తనిఖీల నిర్వహణ తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో నిఘా బృందాలు సమర్థవంతంగా, నిబద్ధతతో తమ బాధ్యత నిర్వహించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలన్నారు. అన్ని పార్టీలు, అభ్యర్థుల పట్ల నిబంధనలకు అనుగుణంగా సమదృష్టితో వ్యవహరించాలన్నారు. వివక్షను ప్రదర్శించారనే ఫిర్యాదులు రాకుండా పక్కాగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలకు తప్పవని హెచ్చరించారు.

నగదు, మద్యం పంపిణీపై నిఘా

ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా వాస్తవాలను నిర్ధారించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. తప్పుడు ఫిర్యాదుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని.. అలాంటి వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల వ్యయం, ప్రచార సరళిపై నిఘా బృందాలు అనునిత్యం నిఘా ఉంచాలన్నారు. ఇందుకు పూర్తిస్థాయిలో బృందాలను ఏర్పాటు చేశామన్నారు. స్టాటిస్టిక్ సర్వేలైన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర బృందాలకు సమకూర్చిన వాహనాలకు అత్యాధునిక సాంకేతికతతో కూడిన పీ.టీ.జీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్నామని చెప్పారు. వీటితో నిఘా బృందాల పనితీరును కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తామన్నారు.

నగదు జప్తునకు రశీదులివ్వాలి

తనిఖీల సమయంలో సాధారణ ప్రజలకు అనవసర ఇబ్బందులు ఏర్పడకుండా సంయమనంతో వ్యవహరించాలని, నగదును జప్తు చేసిన సందర్భాలలో పంచనామా నిర్వహించి తప్పక రశీదులు ఇవ్వాలని ఆదేశించారు. ఆధారాలను చూపి నగదు విడిపించుకునే వెసులుబాటు ఉంది అనే విషయాన్ని వివరించాలని అన్నారు. ఆయా పార్టీలు, అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన రేట్ కార్డును అనుసరిస్తూ లెక్కింపు చేయాలన్నారు. ఎన్నికల నిర్వాహణ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేలా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో డీఆర్‌ఓ సంగీత, ఎన్నికల వ్యయం నోడల్ అధికారి వెంకట్‌రెడ్డి, ఎంసీసీ నోడల్ అధికారి సీపీఓ సౌమ్య, సంబంధిత టీమ్ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కారు నుంచి కాసాని

చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిని ప్రకటించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

చేవెళ్ల: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార ప్రతిపక్ష పార్టీలు అభ్యర్థుల జాబితాలు విడుదల చేస్తున్నాయి. బుధవారం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్.. చేవెళ్ల అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పేరును ప్రకటించారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న రంజిత్‌రెడ్డి పోటీకి విముఖత చూపారు. దీంతో సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకుని సత్తా చాటేందుకు గులాబీ దళపతి ఊహించని రీతిలో కాసానికి టికెట్ కేటాయించారు. పార్లమెంట్ పరిధిలో ఈ నెల 23న భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. కాగా బీజేపీ నుంచి ఇక్కడ గతంలో ఎంపీగా పనిచేసిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పోటీలో ఉన్నారు. అధికార కాంగ్రెస్ నుంచి పట్నం సునీతారెడ్డి పేరు దాదాపు ఖరారే అంటూ వార్తలు వినిపిస్తున్నా అధికారికంగా ఇంకా ఎటువంటి ప్రకటన వెలువడలేదు. ముదిరాజ్ సంఘం జాతీయ అధ్యక్షుడిగా ఉన్న కాసాని చేవెళ్ల నుంచి రెండో సారి ఎంపీ అభ్యర్థిగా తలపడుతున్నారు. గతంలో మన పార్టీని స్థాపించిన ఆయన 2009లో ప్రజారాజ్యం పార్టీతో పొత్తు పెట్టుకుని చేవెళ్ల పార్లమెంట్ స్థానానికి పోటీ చేశారు.




బయోడేటా

పేరు: కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్
తల్లిదండ్రులు: కౌసల్య, రాములు
భార్య: చంద్రకళ
పుట్టిన తేదీ: 19.08.1954
విద్యాభ్యాసం: ఎస్‌ఎస్‌సీ
స్వగ్రామం: బాచుపల్లి, కుత్బుల్లాపూర్ మండలం, మేడ్చల్ జిల్లా
కులం: ముదిరాజ్
ప్రస్తుత పదవి: బీఆర్‌ఎస్ నేత, తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు
రాజకీయం ప్రస్థానం: 1975–1987 వరకు యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు. 1988–1993 కుత్బుల్లాపూర్ ఎంపీపీ, 93 బీసీ కులాల ఐక్య వేదిక అధ్యక్షుడిగా, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, తెలంగాణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా, హైదరాబాద్ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు.
2005, 2022–2023లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు
2001–2006 వరకు టీడీపీ నుంచి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్
2008–2012 వరకు రాజ్యసభ సభ్యుడు
2007లో మన పార్టీని స్థాపించారు.
2009 ఎన్నికల్లో మన పార్టీ, ప్రజారాజ్యం పొత్తుతో చేవెళ్ల ఎంపీగా పోటీ

పౌర సమస్యలపై ఏఐ గళం!

కృత్రిమ మేధతో కార్టూన్ల సృష్టి

- సూటిగా, స్పష్టంగా అర్థవంతంగా చిత్రాలు
- ఎక్స్ ఖాతాలో సంబంధిత విభాగాలకు ట్యాగ్
- మణికొండవాసుల వినూత్న ఆలోచనకు ప్రశంసలు



అధిక ట్యాక్స్‌లు చెల్లించమంటూ నిరసన

సాక్షి, సిటీబ్యూరో: కుళాయి రావడం లేదనో, దోమలు, వీధి కుక్కల బెడద ఉందనో, రోడ్లు మరమ్మతులు చేయడం లేదనో, వీధి దీపాలు వెలగడం లేదనో జనం ఆందోళన వ్యక్తం చేయడం.. పౌర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానికులు నిరసన వ్యక్తం చేయడం ఆయా ప్రభుత్వ విభాగాలకు అర్జీ పెట్టుకోవడమూ మనకు తెలిసిందే. కానీ, మణికొండ మున్సిపాలిటీ వాసులు వినూత్న రీతిలో గళమెత్తుతున్నారు. కృత్రిమమేధ(ఏఐ) అస్త్రాన్ని సంధిస్తున్నారు. ఏఐ సాంకేతికతతో కార్టూన్లు రూపొందిస్తున్నారు. వాటిని ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో సంబంధిత ప్రభుత్వ విభాగాలకు ట్వీట్ చేస్తున్నారు. సమస్య తీవ్రతను సూటిగా, స్పష్టంగా, అర్థవంతంగా అధికారులకు చేరవేస్తున్నారు. వినూత్న రీతిలో సమస్యలపై గళమెత్తుతున్న మణికొండ వాసుల ఆలోచనకు ప్రశంసలు లభిస్తున్నాయి.

నీటి ఎద్దడిని తెలిపే ట్యాంకర్ల క్యూ..

వేసవికాలం ఇంకా ప్రారంభం కాకముందే మణికొండలో నీటి ఎద్దడి మొదలైంది. కుళాయి 30–45 నిమిషాలకు మించి రావడం లేదు. దీంతో ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల మీద ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్క ట్యాంకర్‌కు రూ.1,500 నుంచి 2,000 వసూలు చేస్తున్నారు. నీటి ట్యాంకర్ల కోసం స్థానికులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని కళ్లకట్టేలా నీటి ట్యాంకర్ల క్యూను ఏఐతో కార్టూన్ చిత్రీకరించారు.

ముగియని రోడ్ల మరమ్మతులు..

కోతకు గురైన రోడ్డు ‘సీ సెక్షన్’తో ప్రయాణికులు ఎంత ఇబ్బంది పడుతున్నారో కళ్లకు కట్టేలా కార్టూన్‌ను సృష్టించారు. అంజలీ గార్డెన్ కాలనీలో కొత్తగా వేసిన రహదారిని తాజాగా ఓ నిర్మాణ సంస్థ డ్రైనేజీ పనుల కోసం తవ్వారు. దీంతో పన్ను చెల్లింపుదారుల సొమ్ము వృథా అయిందని తెలుపుతూ కార్టూన్‌ను వేశారు. జలమండలి పనుల కారణంగా బీఆర్‌సీ అపార్ట్‌మెంట్ పక్కన ఉన్న ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు మూసి వేశారు. అంజలి గార్డెన్స్ వద్ద ప్రత్యామ్నాయ మార్గాన్ని కూడా క్లోజ్ చేశారు. దీంతో ఉదయం, సాయంత్రం సమయాలలో ఆఫీసులు, స్కూళ్లకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులతో రోడ్ల మీద వాహనాల రద్దీ ఏర్పడుతుంది. గంటల కొద్దీ రోడ్ల మీదే గడపాల్సిన పరిస్థితిని నరకప్రాయమైన ప్రయాణాన్ని కళ్లకు కట్టినట్లు చూపించే కార్టూన్‌ను చిత్రీకరించారు.

నో వాటర్ నో ఓటు..


రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తేనే పన్నులు చెల్లిస్తామని, రాజకీయ నాయకులు తమ ప్రాంతానికి రావద్దంటూ నిరసిస్తూ ‘నో వాటర్ నో ఓటు అంటూ’ కార్టూన్‌ను సృష్టించారు. ల్యాంకో హిల్స్ నుంచి ఔటర్‌కు కొత్తగా లింక్ రోడ్డును ఓపెన్ చేశారు. కానీ, సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో ఈ రోడ్డు గురించి వాహనదారులకు అవగాహన లేదు. దీంతో బస్సులు, నిర్మాణ వాహనాలు అంజలి గార్డెన్ కాలనీ మీదుగానే వెళుతున్నాయి. అసలే 20 ఫీట్లే ఉన్న ఈ రహదారిని భారీ వాహనాలు ఆక్రమిస్తున్నాయి. దీంతో భారీ శబ్దకాలుష్యం వస్తుండటంతో నివాసితులు ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి ఏర్పడుతుందని వివరించే పోస్టును క్రియేట్ చేశారు.

ఆలోచన ఇలా..

ఉద్యోగ రీత్యా ఏఐ సాంకేతికత మీద పని చేస్తున్న క్రమంలో వెంకట్ మామిళ్లకు ఈ ఆలోచన వచ్చింది. తన ప్రాంతంలో మున్సిపల్ సమస్యలను లేవనెత్తేందుకు ఏఐను ఎందుకు ఉపయోగించకూడదనిపించింది. దీంతో ఓపెన్ ఏఐ, కో పైలెట్, డల్. ఈ ఆధునిక సాంకేతికతను వినియోగించి స్థానిక సమస్యలపై కార్టూన్లు వేయడం ప్రారంభించాడు. 2022లో ప్రారంభమైన మణికొండ సిటిజన్స్ గ్రూప్ ఎక్స్ ఖాతాకు 1,500లకు పైగా ఫాలోవర్లు ఉన్నారు.



నో వాటర్...నో ఓట్ కాన్సెప్ట్‌తో..



ఓయూ పైలాన్ ప్రారంభం



పైలాన్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ సురభీవాణి, వీసీ రవీందర్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో వందేళ్ల శతాబ్ది ఉత్సవాల పైలాన్‌ను బుధవారం ఎమ్మెల్సీ సురభి వాణి ప్రారంభించారు. ఓయూ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలలో భాగంగా 2017లో పైలాన్‌ను నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. రూ.1.58 కోట్ల వ్యయంతో గత ఏడాది ప్రారంభమైన పనులు ఇటీవల ముగిశాయి. ప్రారంభానికి ముఖ్యఅతిథిగా తొలుత సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతారని నిర్ణయించారు. ఆయన బిజీగా ఉండి రాలేక పోవడంతో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. కానీ ఆయన కూడా హాజరుకాలేదు, చివరకు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు కూతురు సురభివాణి చేతుల మీదుగా పైలాన్‌ను ప్రారంభించారు.

రైతుల ప్రోత్సాహానికే బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట: రైతులను ప్రోత్సహించేందుకే బండలాగుడు పోటీలను నిర్వహిస్తారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని కాకునూర్ గ్రామ శివారులోని శ్రీ మహాలింగేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. అందులో భాగంగా బుధవారం అంతర్రాష్ట్ర రెండేడ్ల బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎద్దులతో రైతులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఈ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలని అన్నారు. దైవచింతనతోనే మానసిక ప్రశాంతత వస్తుందన్నారు. అనంతరం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సూరం జంగయ్య కొంతకాలంలో అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతడి చికిత్స నిమిత్తం రెండు లక్షల ఎల్‌ఓసీని బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల శ్రావణ్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీటీసీలు సురేష్‌రెడ్డి, రమాదేవి, నాయకులు వీరేష్, నర్సింగ్‌రావు, శ్రీధర్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, భాస్కర్‌గౌడ్, పర్వతాలు, యాదయ్య యాదవ్, సుందరయ్య, భీమయ్య, రవీందర్‌గౌడ్, మనోహర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళ.. దుర్గంధం ఇలా!



వాదే ముస్తఫా బస్తీలో ఇళ్ల మధ్య నిలిచిపోయిన మురుగునీరు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని 22వ వార్డు వాదే ముస్తఫాలో రంజాన్ మాసంలో కూడా సమస్యలు పరిష్కరించకపోవడంతో స్థానిక ముస్లింలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వాటర్ ట్యాంక్ సమీపంలో ఉన్న యూసుఫ్-అల్-బాకీ మసీదు వద్ద చెత్తా చెదారం నెలకొంది. రహదారి సైతం గోతులమయంగా మారడంతో నమాజ్‌కు వచ్చి వెళ్లే వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపాలిటీ కమిషనర్ వాణి రెడ్డి, 22వ వార్డు కౌన్సిలర్ సవూద్ అవల్గీకు ఫిర్యాదు చేసినా తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ మైనార్టీ సెల్ మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ మీడియాకు వివరించారు. మ్యాన్‌హోళ్లు సైతం తెరుచుకొని మృత్యు బిలాలుగా మారాయన్నారు. విద్యుద్దీపాలు లేని కారణంగా రాత్రి పూట అంధకారంలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని వాపోయారు. రంజాన్ సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం, అధికారుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే స్థానికంగా సమస్యలను పరిష్కరించకపోతే మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.



మసీదు పక్కన పేరుకుపోయిన చెత్తా చెదారం

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

యాచారం: మనస్తాపంతో ఓ యువకుడు ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల ప్రకారం .. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన దోస శ్రీధర్(24) మనస్తాపంతో జీవితంపై విరక్తి చెందారు. ఇంట్లోనే మంగళవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గుర్తించిన కుటుంబీకులు శ్రీధర్‌ను ఆస్పత్రికి తరలించడానికి ప్రయత్నించగా అప్పటికే మృతి చెందారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సామాజిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ఆమనగల్లు: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా టీబీ వ్యాధి నిరోధక అధికారి అరుణకుమారి తనిఖీ చేశారు. ఆస్పత్రిలో టీబీ వ్యాధిగ్రస్తులకు అందుతున్న వైద్య సేవలను ఆమె పరిశీలించారు. టీబీ రోగులకు అందిస్తున్న మందులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీబీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యాధిగ్రస్తులు సకాలంలో మందులు తీసుకోవడం ద్వారా టీబీని అరికట్ట వచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి పరిక్షిత్ నరేందర్, టీబీ సూపర్‌వైజర్ విజయ్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

షాబాద్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చందనవెల్లి గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండలం ఆలూరు గ్రామానికి చెందిన ఉప్పరి రమేశ్(40) మూడు నెలలుగా చందనవెల్లి వెల్స్‌పన్ పరిశ్రమలో ఆఫీస్‌బాయ్‌గా పనిచేస్తున్నారు. రోజు మాదిరిగానే మంగళవారం సాయంత్రం విధులు ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో చందనవెల్లి ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. స్థానికులు గమనించి వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరిశీలించగా అప్పటికే రమేశ్ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఝాన్సీరాణి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీరువాలో దాచిన ఆభరణాలు మాయం

మొయినాబాద్: తాకట్టు నుంచి విడిపించుకొచ్చి ఇంట్లో బీరువాలో పెట్టిన 32 తులాల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. ఈ సంఘటన మొయినాబాద్‌లోని సహారా కాలనీలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ గ్రామానికి చెందిన మహ్మద్ చాంద్‌పాషా మార్వాడీ షాపులో తాకట్టు పెట్టిన 14 బంగారు గాజులు, రెండు బంగారు గొలుసులు, ఒక బంగారు నెక్లెస్, మంగళసూత్రం మొత్తం 32 తులాల బంగారు ఆభరణాలను ఈ నెల 7న విడిపించుకొచ్చి బీరువాలో పెట్టారు. మంగళవారం మధ్యాహ్నం బీరువా తెరిచి చూడగా ఆభరణాలు కనిపించలేదు. దీంతో ఇల్లంతా వెతికారు. ఇంట్లో పనిచేసే మహిళపై అనుమానంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో వృద్ధుడి మృతి

ఇబ్రహీంపట్నం: అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నం ఆర్టీసీ బస్టాండ్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లికి చెందిన గొకినేని శ్రీనివాస్‌రెడ్డి(62) రెండు నెలలుగా ఇబ్రహీంపట్నం బస్టాండ్‌లో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. బస్టాండ్ దుకాణాదారులు, ప్రయాణికులు చెప్పే వివిధ కూలీ పనులు చేస్తూ అక్కడే నైట్ వాచ్‌మెన్‌గా కాలం వెళ్లదీస్తున్నారు. మంగళవారం రాత్రి బస్టాండ్‌లోని కంట్రోల్ రూమ్ వద్ద శ్రీనివాస్‌రెడ్డి కింద పడుకొని ఉండటంతో నిద్రిస్తున్నాడని విధి నిర్వహణకు వచ్చిన నర్సింహులు భావించారు. కొద్ది సేపటికి శ్రీనివాస్‌రెడ్డిని లేపేందుకు యత్నించగా అప్పటికే మృతి చెందాడని నర్సింహులు పోలీసులకు తెలిపారు. వారం రోజులుగా మృతుడు అనారోగ్యంతో బాధ పడుతున్నట్లు ఆర్టీసీ సిబ్బంది తెలిపింది. ఈ మేరకు బుధవారం కేసు నమోదు చేసుకొని మృతుని వద్ద ఉన్న సెల్ ఫోన్ కాల్‌డేటా ఆధారంగా వాకబు చేశారు. కానీ ఎవరూ స్పందించలేదు. ఈ మేరకు పెద్ద కొత్తపల్లి గ్రామానికి సమాచారం ఇచ్చిన ఫలితం దక్కలేదు. దీంతో పోలీసులు మృతుని కుటుంబసభ్యుల గురించి ఆరా తీస్తున్నారు.

నగరంలో నీటి వృథా లేదు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో తాగు నీటి వృథాపెద్దగా లేదని జలమండలి తెల్పింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం నగరంలో దినసరి 568 ఎంజీడీ నీటి సరఫరా చేస్తున్నట్లు వెల్లడించింది. కృష్ణా మూడు దశల ద్వారా 270 ఎంజీడీ, గోదావరి ద్వారా 172 ఎంజీడీ, మంజీరా-సింగూర్ నుంచి 106 ఎంజీడీ, ఉస్మాన్ సాగర్ నుంచి 16 ఎంజీడీ, హిమాయత్‌సాగర్ నుంచి 2 ఎంజీడీ నీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొంది. ట్రాన్స్ మిషన్‌లో నష్టాలు 1శాతం కంటే తక్కువగా ఉంటాయని పేర్కొంది.

చేవెళ్లలో బీజేపీ జెండా ఎగరాలి

ఆ పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: చేవెళ్ల పార్లమెంటు స్థానంలో బీజేపీ గెలిపించేందుకు అందరూ కృషి చేయాలని ఆ పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చాకలిగూడగ్రామంలో బీజేపీ జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు మోదీ ప్రభుత్వం హయాంలోనే జరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని విస్మరించాయన్నారు. మరోసారి బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. అధిక పార్లమెంటు స్థానాలను గెలుచుకుంటేనే మోదీ మళ్లీ అధికారంలోకి వస్తారన్నారు. చేవెళ్ల ఎంపీ సీటును గెలిపించుకొని ప్రధానికి బహుమతిగా ఇద్దామని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాశ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు మధుసుధన్‌రెడ్డి, రాజమల్లేశ్, చంద్రశేఖర్, మల్లేశ్‌గౌడ్, వెంకటేష్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శుద్ధమైన నీరు ఆరోగ్యానికి మేలు

షాబాద్: శుద్ధమైన నీటిని తాగితే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మన్‌మర్రి గ్రామంలో వరల్డ్ కినెక్ట్ కార్పొరేషన్, సీపీడబ్ల్యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ వాటర్ ప్యూరిఫికేషన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కాచి, చల్లార్చిన నీటిని తాగడంతో ఆరోగ్యానికి మంచిదన్నారు. రోజుకు కనీసం మూడు నాలుగు లీటర్ల నీరు తాగడం అవసరమన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీటిని సరఫరా చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు సుహాసిని సత్యనారాయణ, గోపాల్, శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణ, గోపాల్, మల్లారెడ్డి, వెంకటేశ్, చంద్రశేఖర్, వెంకటేశ్‌గౌడ్, సురేశ్‌గౌడ్, శంకరయ్య, ముసిలయ్య, నర్సింహులుగౌడ్, ప్రవీణ్, శ్రీధర్ తదితరులున్నారు.



షాబాద్: మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కొండావిశ్వేశ్వర్‌రెడ్డి



మొయినాబాద్‌రూరల్: జెండా ఆవిష్కరిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

గోమాతకు సీమంతం

షాబాద్: ప్రకృతిలోని జీవులతో మనిషికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తూ భారతీయ సాంప్రదాయంలో ప్రత్యేక స్థానం ఉందని జోషి గాయత్రి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని సీతారాంపూర్‌లో గోమాతకు కుటీరంలో మహిళలు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోవుకు మా కుటుంబం ఘనంగా సీమంత వేడుకలు నిర్వహించామన్నారు. స్త్రీ మరో జీవికి ప్రాణం పోసే ముందు క్షేమాన్ని కాంక్షిస్తూ హిందూ సంస్కృతిలో జరిపే ముఖ్య ఘట్టం సీమంతమన్నారు. తల్లి, పుట్టబోయే శిశువు క్షేమాన్ని కోరుతూ జరిపించే సాంప్రదాయ వేడుక సాధారంగా గర్భవతికి 5వ నెల గాని, తొమ్మిది నెలలో గాని సీమంతం జరుపుతారన్నారు. కొంతకాలంగా పెంపుడు జంతువులు గర్భం దాలిస్తే సీమంతం జరిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో గోమాతకు కూడా వేడుక చేశామన్నారు. కార్యక్రమంలో జోషి, సాయి, ప్రజ్ఞా, విషాల్ శర్మ, గోభక్తులు గ్రామస్తులు తదితరులున్నారు.



గోమాతకు సీమంతం నిర్వహిస్తున్న మహిళలు

గంజాయి విక్రేతల అరెస్టు

2.3 కిలోల గంజాయి స్వాధీనం

కందుకూరు: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 2.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మక్బూల్‌జానీ తెలిపిన వివరాల ప్రకారం.. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ మీరాజ్ అన్సారీ(27), మహ్మద్ షాబుద్దీన్ అన్సారీ(26) కొంత కాలంగా కందుకూరుకు వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. కాగా డబ్బులు అధికంగా సంపాదించాలనే ఆశతో ఝార్ఖండ్ నుంచి రెండు కిలోల 300 గ్రాముల గంజాయిని ఈ నెల 10న తెచ్చారు. మంగళవారం సాయంత్రం కందుకూరు చౌరస్తా సమీపంలోని శ్రీశైలం హైవే హైటెక్ దాబా ఎదుట విక్రయిస్తుండగా పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి నుంచి గంజాయితో పాటు రెండుసెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం సాయంత్రం వారిద్దరిని రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

లింగాయత్ కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్

కడ్తాల్: వీరశైవ లింగాయత్ కార్పొరేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం హర్షణీయమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొంత కాలంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్, గౌరవ అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్పలు చేసిన పోరాటానికి ప్రతిఫలం లభించిందన్నారు. అదే విధంగా లింగాయత్ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేసిన సురేశ్ షెట్కర్‌తో పాటు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటు రాష్ట్ర వీరశైవ లింగాయత్ బలిజ సంఘం సాధించిన అద్భుత విజయమని పేర్కొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

కేశంపేట: బతుకుదెరువు కోసం ఆంధ్రప్రదేశ్ నుంచి మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామ శివారులో మామిడితోటను లీజ్‌కు తీసుకున్న వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని కర్నూల్ జిల్లా కల్లూరు మండలం పెద్దతెగురుకు చెందిన తెలుగు శివశంకర్(55) గ్రామ శివారులో భూమయ్యకి చెందిన మామిడితోటను లీజ్‌కు తీసుకొని ఒంటరిగా నివాసం ఉంటున్నారు. ఆయన ఈ నెల 11న భోజనం చేస్తుండగా గుండెపోటు రావడంతో బోర్ల పడి మృతి చెంది ఉండవచ్చని గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేశారు. మృతుడికి భార్య లక్ష్మీదేవితో పాటు ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి తమ్ముడు మల్లేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

టాలెంట్ టెస్టులతో విద్యార్థులకు ప్రోత్సాహం



విద్యార్థులను సత్కరిస్తున్న వెంకటేశ్వరావు

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరావు

మాడ్గుల: టాలెంట్ టెస్టులతో విద్యార్థులకు ప్రోత్సాహం అందుతుందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరావు అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలను ఏటా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని ఇర్విన్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన సైన్స్ టాలెంట్ రాష్ట్రస్థాయి పోటీలలో రెండవ బహుమతి సాధించిన విద్యార్థులు చరణ్ తేజ, శ్రోహిత్, జునైద్‌లకు బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఘనంగా సత్కరించి అభినందించారు. అలాగే గైడ్ ఉపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి, నాగమణి, భిక్షపతి, శ్రీలక్ష్మిలను సత్కరించారు. అనంతరం వెంకటేశ్వరావు మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. విద్యార్థులు సైన్స్ ప్రాధాన్యతను గుర్తించాలని మూఢ నమ్మకాల నిర్మూలనకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి బి.ఎస్.రెడ్డి, మాడ్గుల ఎంఈఓ సర్దార్ నాయక్, ప్రధానోపాధ్యాయుడు పర్వతాలు, ఉపాధ్యాయులు సుధారాణి, ముత్యం రెడ్డి, రమణాచార్యులు, నాగమణి, వెంకటయ్య, నందన, భిక్షపతి, అర్చన, శ్రీలక్ష్మి, మొగులయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.

జాతరకు తీసుకుపోలేదని ఆత్మహత్య

చేవెళ్ల: జాతరకు తీసుకుపోలేదనే విషయంలో భార్యాభర్తలు గొడవ పడ్డారు. మనస్తాపంతో భార్య ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన భీమ్‌కుమార్, రేణుక(27) దంపతులు. బతుకు దెరువు నిమిత్తం మూడు నెలల క్రితం చేవెళ్లకు వచ్చి అద్దె గదిలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నారు. వీరికి ఒక బాబు ఉన్నాడు. మండల కేంద్రంలో ప్రస్తుతం శివరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ జాతరకు తీసుకుపోవాలనే విషయంలో భార్యాభర్తలు రాత్రి గొడవ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన రేణుక ఇంట్లో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతురాలి తండ్రి మల్లప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



రేణుక మృతదేహం

జాతిపిత విగ్రహం ధ్వంసం

- మద్యం మత్తులో వ్యక్తి వీరంగం
- కేసు నమోదు చేసిన పోలీసులు

షాద్‌నగర్‌రూరల్: తాగిన మైకంలో ఓ వ్యక్తి మహాత్మాగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అన్నారం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. అన్నారం గ్రామపంచాయితీ పరిధిలోని గుండ్యానాయక్‌తండాకు చెందిన పాత్లావత్ శంకర్‌నాయక్ మద్యం తాగాడు. ఆ మత్తులో గ్రామ ముఖ్య కూడలిలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేశాడు. ఈ ఘటనలో గాంధీ విగ్రహం నేలపై పడిపోయింది. దీంతో గ్రామస్తులు పోలీసులకు ఆశ్రయించారు. ఘటనపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఉప సర్పంచ్ పృధ్వీరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ దేవకి తెలిపారు.



నేలపై పడిపోయిన గాంధీ విగ్రహం